TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 221 పేజీలు - 08 శుక్రవారం 04 జులై 2025

## అంగన్‌వాడీ హెల్పర్లకు శుభవార్త

**- టీచర్ ప్రమోషన్ల గరిష్ట వయోపరిమితి పెంపు**

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** అంగన్వాడీ హెల్పర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అంగన్వాడి టీచర్లుగా ప్రమోషన్ పొందే హెల్పర్ల గరిష్ట వయోపరిమితిని పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం వల్ల 45 ఏళ్లు దాటిన హెల్పర్లకు ప్రయోజనం చేకూరనుంది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లు ఉన్నారు. వీరందరికీ అంగన్వాడీ టీచర్లుగా ప్రమోషన్ దక్కే అవకాశం ఉంది. టీచర్లుగా ప్రమోషన్ పొందాలి అనుకునే అంగన్వాడి హెల్పర్ల గరిష్ట వయసును 50 ఏళ్లకు పెంచే ఫైలుపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేసింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి సీతక్కకు అంగన్వాడి యూనియన్ లు ధన్యవాదాలు తెలిపారు.









## పెట్టుబడుల ఆకర్శణలో ముందున్న

# తెలంగాణ

- అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్ నగరం
- దేశానికి ఫ్యూచర్ సిటీని అందించబోతున్నాం
- ప్రపంచ నగరాలతోనే తమ పోటీ ఉంటుంది
- డిసెంబర్ 9న విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ
- మలబార్ గోల్డ్ తయారీ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్

**తొలి అక్షరం/రంగారెడ్డి,జులై 3:** హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మహేశ్వరంలో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించ బోతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామన్నారు. మహేశ్వరం లో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతు న్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరి స్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై

మిగతావి 2లో

## ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత

# పురస్కారం

- రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టిపు వాణిజ్యం
- ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు...పార్లమెంటులో ప్రసంగం
- భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన
- ఆశ్చర్య పోయిన పార్లమెంట్ సభ్యులు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై 03:** భరాత ప్రధానికి ఘనమైన స్వాగతం, సత్కారం లభించాయి. ఘనా అత్యున్నత పురస్కారం కూడా ప్రదానం చేసింది. రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనా దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఘనాకు భారతదేశం కేవలం భాగస్వామి మాత్రమే కాదని.. ఇరుదేశాలు కలిసి జోడీగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టులలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయని మోదీ చెప్పుకొచ్చారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనా దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధులు, ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తోంది. ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు జాన్ ద్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశాలపై చర్చించారు. ఇండియా.. ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉందని మోదీ చెప్పారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని..

మిగతావి 2లో

## హైదరాబాద్ చేరుకున్న

# ఏఐసీసీ చీఫ్

- ఎయిర్‌పోర్టులో ఖర్గేకు స్వాగతం పలికిన రేవంత్ తదితరులు



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే గురువారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఆయనకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని తాజ్ కృష్ణ హోటల్‌కు ఖర్గే చేరుకున్నారు. అయితే మంత్రి పదవి ఆశించి భంగపడ్డ పలువురు ఎమ్మెల్యేలతో ఖర్గే భేటీ కానున్నారు. అందుకోసం వారికి ఖర్గే అపాయింట్ మెంట్ ఇచ్చారు. కాగా, ఆది శ్రీనివాస్, బాలు నాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఇప్పటికే తాజ్ కృష్ణా హోటల్‌కు చేరుకున్నారు. అలాగే తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య సైతం ఖర్గేతో భేటీ కానున్నారు. శుక్రవారం నగరంలోని ఎల్బీ స్టేడియంలో పార్టీ కార్యకర్తలతో

మిగతావి 2లో



## 5న బిజెపి అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావు శనివారం

మిగతావి 2లో

## అనారోగ్యంతో బాధపడుతున్న కెసిఆర్

- చికిత్స కోసం యశోదాలో చేరిక

# పదేళ్లపాటు బిసిలు యాదికి లేరా..?

- ఎమ్మెల్సీ కవితకు మహేశ్ గౌడ్ చురకలు



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** ఎమ్మెల్సి కవిత ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాసింది బిఆర్ఎస్ నేతగానా? జాగృతి నాయకురాలిగానా? అని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల కోసం కవిత ఉద్యమం ఎక్కడ చేసిందని అన్నారు. పదేళ్ల పాటు బిసిలు గుర్తుకు రాలేదా అంటూ కవితకు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బిసి బిల్లు చేసేటప్పుడు కవిత జైల్లో ఊచలు లెక్కపెడుతోందని విమర్శించారు. కవిత ఇప్పటిదాకా బిసిల కోసం ఒక్క మాట మాట్లాడిం దా? అని అన్నారు. రాజకీయ శూన్యంలో ఉన్న కవిత ఉనికి కోసమే మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. పదేండ్లు బిసిలకు మాజీ సిఎం కెసిఆర్ ఏం చేశారని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్లు తగ్గించింది కెసిఆర్ కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ లో కోవర్టులున్నారన్న ఎమ్మెల్యే అనిరుధ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలపై

మిగతావి 2లో

## బిసి రిజర్వేషన్ల కోసం


# ఢిల్లీకి అఖిలపక్షం

- ప్రధాని మోడీతో అఖిలపక్షం కోసం బిజెపి రావాలి
- రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ బిసి నేతలు ఒత్తిడి తేవాలి
- 17న రైల్ రోకోకు అన్ని పార్టీలు ముందుకు రావాలి
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీకి అఖిలపక్షంను తీసుకుని వెళ్లాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోమారు డిమాండ్ చేశారు. దీనిపై తేల్చకుండా స్థానిక ఎన్నికలను నిర్వహించ రాదని అన్నారు. బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు. 8 లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీలు లేదని విమర్శించారు. రైల్ రోకోకు మద్దతు కోరుతూ బిఆర్ఎస్ సహా అన్ని పార్టీలకు లేఖ రాస్తామని చెప్పారు. గోదావరి- బనకచర్ల విష యంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోందని,

మిగతావి 2లో




## గ్రూప్ వన్‌లో అవకతవకలపై

# పిటిషన్లు

ఎలాంటి అవకతవకలు లేవన్న టీజీపీఎస్సీ వాదనలు విని విచారాణను నేటికి వాయిదా వేసిన హైకోర్టు

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తెలుగు మీడియం

మిగతావి 2లో

## పైరసీపై కఠిన చర్యలు

- ఎఫ్.డి.సీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు
- సినిమా ఇండస్టీ సమస్యల పరిష్కారానికి కృషి: ఎఫ్.డి.సి ఛైర్మన్ దిల్ రాజు



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. గురువారం ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంకతో కలిసి సమాచార శాఖ ఎఫ్‌డీసీ బోర్డు రూమ్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో పలు కీలక

మిగతావి 2లో

## హైదరాబాద్ చేరుకున్న ఏఐసీసీ చీఫ్

(మొదటి పేజీ తరువాయి)

భారీ సభ జరగనుంది. ఈ సభకు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు క్యాడర్‌కు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీగా కేడర్‌ను ఈ సభకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు శుక్రవారం జరగనున్న ఈ సభకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

## 5న బిజెపి అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శనివారం నాడు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి.. ఉదయం 10 గంటలకు బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. అనంతరం చార్మినార్ దగ్గర ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారని కమలం పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. బీజేపీ హైకమాండ్ ఆదేశాల మేరకే రామచంద్రరావును పార్టీ చీఫ్ గా ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కానీ, రామచంద్రరావు ఎంపికపై అసంతృప్తి వ్యక్తం చేసిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ నామినేషన్ వేయడానికి ప్రయత్నించినప్పటికీ కౌన్సిల్ సభ్యుల బలం లేకపోవడంతో ఆయన నామినేషన్ తీసుకోలేదు. దీంతో అసంతృప్తితో ఉన్న ఆయన పార్టీకి రాజీనామా చేశారు. అలాగే, అధ్యక్ష రేసులో ఉన్న ఎంపీ ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్‌లు కమలం పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు రామచంద్రారావుకు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కిషన్ రెడ్డి స్థానంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ఎన్నికయ్యారు. ఆయన శనివారం నాడు పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

## పదేళ్లపాటు బిసిలు యాదికి లేరా..?

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా పరిగణి స్తున్నామని, పార్టీ నేతలు మాట్లాడేటప్పుడు చూసుకుని మాట్లాడాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా? అని మండిపడ్డారు. క్రమశిక్షణ విషయంలో రాజీపడేది లేదని, బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

## రోశయ్యకు అరుదైన గౌరవం

**● ఆయన జయంతి వేడుకలనుఅధికారికంగా నిర్వహిస్తున్నాం ● 16సార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత రోశయ్యదే జయంతి ● సందేశంలో సింఎం రేవంత్‌రెడ్డి**



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆయన్ను స్మరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రె స్ ప్రభుత్వంలో 16సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దక్కించుకున్నారని కొనియాడారు. రోశయ్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని తమ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. తమ ప్రభుత్వం అరుదైన గౌరవం ఆయనకు కల్పించిందని సిఎం పేర్కొన్నారు. రోశయ్య సుమారు 50 ఏళ్లు రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నా వివాదరహితుడిగా పేరు పొందారని సిఎం అన్నారు. సమైక్య ఎపికి ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన తర్వాత తమిళనాడు గవర్నర్‌గా కూడా ఆయన సేవలందించారని ఆయన తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మృతి



**తొలి అక్షరం/సిద్దిపేట,జూలై 3:** సిద్ధిపేట జిల్లాలోని చేర్యాల గేటు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిల్మ్‌నగర్ ఎస్ఐ రాజేశ్వర్ మృతి చెందాడు. అర్థరాత్రి లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ఫిల్మ్‌నగర్ ఎస్సై రాజేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆయన్ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు ముగించుకొని వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ స్వస్థలం సంగారెడ్డిలోని చాణక్యపురి కాలనీ. వారం రోజుల క్రితమే హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. రాజేశ్వర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 1990లో ఆయన పోలీసు శాఖలో ఉద్యోగంలో చేరారు. ఈ ఘటనతో స్థానిక పోలీసులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## పెట్టుబడుల ఆకర్షణలో ముందున్న తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీపడుతున్నాయని చెప్పారు. మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిం చారు. 'పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుంది. హైదరాబాద్‌కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు.. ప్రపంచ నగరాలతోనే పోటీ. రానున్న వందేళ్లను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 ప్రణాళికను రూపొందించుకున్నాం. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశాలకు చెందిన కన్సల్టెంట్స్ పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభాల్లో సాగేలా సహకరిస్తున్నాంఅని సీఎం తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణలో తయారీ రంగం అభివృద్ధి ఎక్కువగా ఉందని.. 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని చెప్పారు. గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ-2025ను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు 4,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. 15 రోజుల్లోనే 98 శాతం దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగిల్ విండో విధానంలో పారదర్శకంగా, వేగంగా అనుమతులు ఇస్తున్నామన్నారు.

## ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఉగ్ర ముప్పును ఎదుర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ, భద్రతా రంగంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. సాయుధ దళాల శిక్షణ, సముద్ర భద్రత, రక్షణ సామాగ్రి సరఫరా, సైబర్ భద్రత తదితర రంగాల్లో భారత్-ఘనా దేశాల మధ్య పరస్పర సహకారం పెరుగనున్నదని ప్రధాని మోదీ తెలిపారు. అటు, సంస్కృతి, సాంప్రదాయ వైద్యం తోపాటు పలు రంగాల్లో సహకారాన్ని అందించే నాలుగు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. అనంతరం ఘనా పార్లమెంటును సందర్శించి సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ గౌరవనీయమైన సభలో ప్రసంగించడం తనకు చాలా గౌరవంగా ఉందన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రతినిధిగా, 1.4 బిలియన్ల భారతీయుల సద్భావన, శుభాకాంక్షలను తీసుకువచ్చానని అన్నారు. బుధవారం సాయంత్రం తన ప్రియ స్నేహితుడు, అధ్యక్షుడు జాన్ మహామా నుంచి ఘనా జాతీయ అవార్డును స్వీకరించడం హృదయపూర్వక అనుభవమని మోదీ సభకు చెప్పారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లని చెప్పిన మోదీ.. మనకు, ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదన్నారు. ఇది మన ప్రాథమిక విలువలలో ఒక భాగమని చెప్పుకొచ్చారు. భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్రాలను పరిపాలించే 20 వేర్వేరు పార్టీలు, 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయని మోదీ చెప్పారు. భారతదేశానికి వచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతించడానికి ఇదే కారణమని ప్రధాని అన్నారు.'ఇవాళ మన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు, ఘనా బిడ్డ డాక్టర్ క్వామే న్క్రుమాకు నివాళులర్పించే గౌరవం నాకు లభించిందని' అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశిష్ట రాజనీతి, ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రామణి మహామా చేతుల మీదుగా ఘనా జాతీయ గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' పురస్కారాన్ని అందుకున్నారు. 1.4 బిలియన్ల భారతీయుల తరపున ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పిన మోదీ.. ఈ గౌరవాన్ని భారతదేశ యువత ఆకాంక్షలు, సాంస్కృతిక, సంప్రదా యాలు, వైవిధ్యం, ఇంకా ఘనా - భారత్ మధ్య చారిత్రక సంబంధాలకు అంకితం చేశారు. ఈ గౌరవాన్ని అందించినందుకు ఘనా ప్రజలకు, ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశంలో పర్యటించడం తనకు లభించిన గౌరవమని హర్షం వ్యక్తంచేశారు. ఘనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతోందని కొనియాడారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోంది. సాంకేతికతలో విప్లవం, గ్లోబల్‌సౌత్‌లో ఎదుగుదల ఆ మార్పునకు దోహదం చేస్తున్నాయి. గ్లోబల్‌సౌత్ గళం వినిపించకుండా ఆ పురోగతి సాధ్యంకాదు అన్నారు. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మా ప్రజలు సంకల్పంతో ఉన్నారు. బలమైన భారత్.. సుస్థిరమైన ప్రపంచానికి దోహదం చేస్తుంది. ఆఫ్రికా అభివృద్ధి దిశగా చేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తాం. మన దేశాల పురోగతికి పరస్పరం సహకరించు కుందామని మోదీ పిలుపునిచ్చారు. జీ20కి భారత్ సారథ్యం వహిస్తోన్న తరుణంలోనే ఆ గ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమని వ్యాఖ్యానించారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాలకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం.

## అనారోగ్యంతో బాధపడుతున్న కెసిఆర్

**● చికిత్స కోసం యశోదాలో చేరిక**

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా కెసిఆర్ సీజనల్ జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. అయితే గురువారం ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి నగరంలో నందినగర్‌లోని తన నివాసానికి కేసీఆర్‌తోపాటు




ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. గత వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు జర్వం ఆయన్ని ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నారు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఓపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్‌సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్‌కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించింది. దీంతో ఇన్ సైడ్ విచారణకు కేసీఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఆయనకు జ్వరం తీవ్రం కావడంతో ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. కెసిఆర్ వెంట భార్య శోభారాణి, కెటిఆర్,హరీష్ రావు, మాజీ ఎంపి సంతోష్ కుమార్ ఉన్నారు.

## బిసి రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షం

(మొదటి పేజీ తరువాయి)

ఎపి సిఎం చంద్రబాబు నాయుడును ఒక్క మాట కూడా అనలేదంలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంపై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు. బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకోని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి కనబరుస్తున్నదని విమర్శించారు. ఏపీ సీఎంను ఒక్క మాట కూడా అనలేదని ధ్వజమెత్తారు. కొందరి కాంట్రాక్టుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని చెప్పారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బనకచర్లను ఆపాలని గట్టిగా కొట్లాడాలని చెప్పారు.

## గ్రూప్ వన్‌లో అవకతవకలపై పిటిషన్లు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులకు సరైన మార్కులు వేయలేదని పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు. కోఠిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవం. అక్కడ ఉన్న రెండు కేంద్రాలలో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. మిగతా పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపికయ్యారు. కోఠిలోని రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించడంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారు. వారు చేస్తోన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు. కేవలం అపోహలు మాత్రమేనని వాదించారు. గ్రూప్ 1కు ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95 శాతం, ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మాధ్యమంలో 0.1 శాతంగా ఉన్నారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. టీజీపీఎస్సీకి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదు. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎవాల్యుయేటర్‌కు ఏమైనా మార్గదర్శకాలున్నాయా అని ప్రశ్నించింది. టీజీపీఎస్సీ నుంచి వివరాలు తీసుకొని సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను ఉన్నత న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

## పైరసీపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలు నిర్వహించామని, సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. అవసరమైతే నూతన నిబంధనల రూపకల్పన కూడా చేస్తామని అయన వెల్లడించారు. ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా , ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్‌లకు ఆ÷-లనైన్ అనుమతుల ప్రొసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని దిల్ రాజు పేర్కొన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరం కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఫ్‌డీసీ ఎండీ సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి, సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇండస్ట్రీ సమస్యలపై ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండ తాము కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## అసమర్థ పాలన వల్లే రాష్ట్రంలో యూరియా కొరత:ఎంపి డికె అరుణ



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 3:** రాష్ట్రంలో యూరియా కొరతపై రైతుల్లో అపోహలు కలిగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ నేతలు కేంద్రాన్ని టార్గెట్ చేస్తూ చేస్తున్న అసత్య ప్రచారాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తోందని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ పాలన వల్లే ఏర్పడిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎరువుల కొరత లేకపోయినా, ఒక్క తెలంగాణలో మాత్రమే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం దారుణమన్నారు. సరఫరా, నిల్వల ప్రణాళికలో వైఫల్యం వల్లే రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు సరఫరా, నిల్వల ప్రణాళికపై వైఫల్యం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఎరువుల విషయంలో రాష్ట్ర రైతులు ఎలాంటి అపోహలో పడొద్దని, ఈ రబీ సీజన్‌కు రాష్ట్రానికి అవసరమైన యూరియాను కంటే ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సరఫరా చేసిందన్నారు.రాష్ట్రానికి అవసరం 9.5 లక్షల మెట్రిక్ టన్నులైతే కేంద్రం 12.02 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా పంపిందని గుర్తు చేశారు. ఇదే కాకుండా డీఏపీ, ఎన్‌పికెఎస్ వంటి అన్ని ఎరువులూ రాష్ట్ర అవసరానికి మించి పంపించా మన్నారు. డీఏపీ కోసం 1.47 లక్షల టన్నులు అవసరం ఉండగా, 1.72 లక్షల టన్నులు పంపించడమే దీనికి ఉదాహరణ అని అన్నారు. కేంద్రం ఎప్పటికప్పుడు రాష్ట్ర అవసరాలను అంచనా వేసి అధికంగా సరఫరా చేస్తోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మార్క్‌ఫెడ్ దివాళా తీసిందని చెబుతూ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను రైతులపై మోపడం, కొన్ని కోఆపరేటివ్ సంఘాల్లో ఎరువులు నిల్వ వేసి బ్లాక్ మార్కెట్‌కు తిప్పడంపై ఆరోపణలు రావడం ఈ పరిస్థితికి నిదర్శనం. అసలు సమస్య రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం. కానీ దాన్ని కప్పిపుచ్చుకు నేందుకు కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేయడం అనైతిక చర్యగా ఆమె అభివర్ణించారు.

# లంబాడి హక్కుల కోసం మరో పోరాటం

● రాష్ట్రంలో అత్యధిక జనాభా గలిగిన లంబాడాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి ● గిరిజన హక్కులకై కదం తొక్కిన లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పి ఎస్) ● మహబూబాబాద్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఎల్ హెచ్ పి ఎస్ 29 ఆవిర్భావ సభ



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జులై 3:** లంబాడి హక్కుల పోరాట సమితి ఎల్ హెచ్ పి ఎస్ (నంగారభేరి) 28వ వార్షికోత్సవ సభ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్ అధ్యక్షతన,మహబూబాబాద్ శాసనసభ్యులు మురళి నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్ మాట్లాడుతూ,రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గోరుబోలి భాషను అధికారికంగా గుర్తించి ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చేవరకు ఎల్ హెచ్ పి ఎస్ అవిశ్రాంతంగా పోరాటం చేస్తుందని తెలిపారు. ఎస్టీల రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 7% శాతం నుండి 14% శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు సాగు చేసుకుంటున్నా భూములకు ప్రతి గిరిజన రైతుకి పోడు పట్టాలు ఇవ్వాలని అన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఐటిడిఏను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిందని, ఆ హామీని తక్షణమే అమలు చేయాలని అన్నారు. నూతన గ్రామపంచాయతీలకు రెవెన్యూ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో ఉన్న ట్రైకార్ రుణాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ సంబంధించిన నిధులను విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు విద్యార్థులకు స్కూల్లో రానీయకపోవడం, హాలో ఎల్ హెచ్ పి ఎస్ పోరాటం చేసిన రాష్ట్ర ప్రభుత్వ స్పందించకపోవడం విడ్డూరమని అన్నారు. తక్షణమే బెస్ట్ అవైలబుల్ స్కూల్ సంబంధించిన నిధులను విడుదల చేయాలని ఎల్ హెచ్ పి ఎస్ డిమాండ్ చేస్తుంది అని అన్నారు. ఎస్సీ ఎస్టీ కోసం ఏర్పాటు చేసిన సబ్ ప్లాన్ నిధులను పక్కదారి మళ్లించకుండా, గిరిజనుల అభివృద్ధి కొరకు మాత్రమే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్, బోడ లక్ష్మణ్ నాయక్ మాజీ సర్పంచ్, భూక్య నెహ్రూ నాయక్, గూగులోత్ వెంకట్ నాయక్, భూక్య రామ్మూర్తి నాయక్,ఎల్ ఎస్ ఓ జిల్లా అధ్యక్షుడు బోడ చందులాల్, మూడ్ రవి నాయక్, అజ్మీర శ్రీనివాస్ నాయక్, భూక్య రమేష్, అజ్మీర వెంకన్న, భాను పవన్, తేజావత్ మంగీలాల్, లావుడియా ఉదయ్, విజయ భాయ్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎల్బి స్టేడియంలో జరిగే సభను విజయవంతం చేయండి

● తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా నేడు హాజరయ్యే ఈ సభకు ఆలేరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున్న హాజరుకావాలన్నారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అనే నినాదంతో భావి ప్రధాని రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్న తరుణంలో రేపు జరిగే ఈ సభను విజయవంతం చేయాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం రక్షించే విధంగా, ఈ మతతత్వ శక్తుల నుండి భారతదేశాన్ని విముక్తి చేయాలని, దేశంలో మోడీ చేస్తున్న బీసీ వ్యతిరేక విధానాన్ని ఎండగట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన బీసీలకు పెద్దపీట వేసి అన్నిట్లో వారికి అవకాశాలు ఇస్తూ కేంద్రం మెడలు వచ్చి బీసీ డిక్లరేషన్ ద్వారా రేపు రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో 42% శాతం రిజర్వేషన్ కల్పించి ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగుర వేసే ఆలోచన మేరకు నేడు ఎల్బీ స్టేడియంలో జరుగబోయే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రేషన్ కార్డు దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి

● అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

● సిపిఎం ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి



**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** రేషన్ కార్డు దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వేగవంతం చేసి అరులైన పేదలందరికీ రేషన్ కార్డులు అంది ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జిల్లాల పెంటయ్య మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్ కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడుతూ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదలకు సకాలంలో రేషన్ కార్డును అందివ్వాలని అన్నారు.దరఖాస్తు చేసుకొని 15 రోజులు గడుస్తున్న రోజు తహసిల్దార్ కార్యాలయం చుట్టూ,మీ సేవకేంద్రాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వస్తుందనిఅన్నారు.అధికారులు భూభారతి పేరుతో గ్రామాలలో తిరగడం మూలంగా దరఖాస్తుదారులు పడిగాపులు కాయాల్సి వస్తుందని అన్నారు. తొలగింపు ప్రక్రియను పూర్తి చేసి నూతన కార్డులను అందివ్వాలని అన్నారు. దరఖాస్తుకు స్పందించిన తహసిల్దార్ సెక్షన్ అధికారులను పిలిచి సమీక్షించి వెంటనే పూర్తి చేస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్,కల్లూరి నాగేష్,మండల కమిటీ సభ్యులు ఎండి రషీద్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రావణ్ కుమార్ ప్రజానాట్యమడుగు జిల్లా అధ్యక్షుడు గంటపాక శివ కుమార్, శాఖా కార్యదర్శులు గోగు లింగస్వామి శానకొండ వెంకటేశ్వర్లు, పుట్టల ఉదయ్ కుమార్, ఆమనగంటి శేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొడ్డుగొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (సబ్ సెంటర్)ని ఆకస్మిక తనిఖీ

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్..



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జులై 3:** గురువారం గూడూరు మండలం, బొడ్డుగొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ( సబ్ సెంటర్) ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ మాట్లాడుతూ వర్షాకాలంలో అధికంగా వ్యాపించే సీజనల్ వ్యాధుల నివారణపై తీసుకోవలసిన ముందు జాగ్రత్తల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఓఆర్ఎస్ ప్యాకెట్ లను, మలేరియా, డెంగ్యూ సంభంధిత ఆర్‌డిటి కిట్ల నిల్వలను సరిచూసుకోవాలని, లేనట్లైతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకెళ్లి నిల్వలను సమకూర్చుకోవాలని, అన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రతి శుక్రవారం డ్రై డే ను ప్రజలు పాల్గొనే విధముగా అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తూ, దోమల నివారణ చర్యలు తీసుకోవాలి అని, గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఇంటింటా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.వర్షాలు ఎక్కువగా వున్నట్లైతే గర్భిణీ స్త్రీలు కాన్పు కు దగ్గరగా వున్నవారిని ఆసుపత్రిలో ముందుగానే చేర్చుకొని ప్రసవం పిదప వారిని పంపించాలని పేరుకొన్నారు. టిబి ముక్త్ భారత్ కార్యక్రమములో భాగముగా 2025 నాటికి భారతదేశం క్షయ వ్యాధినిర్మూలన దిశగా పురోగతిని వేగవంతం చేయడము లో క్షేత్ర స్థాయి సిబ్బంది,ప్రజలలో అవగాహన కల్పించి వల్నరబుల్ జనాభా కు క్షయ నిర్ధారణ పరీక్షలు చేపించి పాజిటివ్ గా నిర్ధారణ జరిగితే పూర్తి చికిత్స అంధించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె. ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, ఎం ఎల్ హెచ్ పి ప్రశాంత్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర సహకార సంఘాల సమితి నూతన కమిటీ ఎన్నిక

● అధ్యక్షులుగా గుంటుక జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏలకుర్తి రమేష్‌లు ఏకగ్రీవ ఎన్నిక









**తొలి అక్షరం/షాద్‌నగర్, జూలై 3:** షాద్‌నగర్ నియోజకవర్గం పరిసర ప్రాంతంలోని 50 గ్రామాలలో విస్తరించి ఉన్న శ్రీ రామలింగేశ్వర సహకార సంఘాల సమితి లిమిటెడ్ వారు 2025–26 సంవత్సరానికి గాను తమ పాలకవర్గ అధ్యక్ష ఎన్నికలను గురువారం రామలింగేశ్వర పొదుపు సంఘం సమితి కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు నాగిళ్ళ కుమార్, సీఈవో పాతంగి సంపత్ కుమార్ ల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 12 వేల మంది సభ్యులతో కూడిన ఈ సమితికి అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గుంటుక జగన్మోహన్ రెడ్డిని నూతన అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఏలకుర్తి రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులను సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ... పొదుపు సంఘాల ద్వారా సభ్యులకు పొదుపులు, అప్పులు, బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలియజేశారు. పొదుపు సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మహిళల ఆర్థిక సాధికారతకు కీలకమైన వేదికలుగా నిలుస్తాయని అన్నారు. ఇవి చిన్న మొత్తాల పొదుపులను ప్రోత్సహించి, సభ్యుల మధ్య పరస్పర సహాయ సహకారాలను పెంపొందిస్తాయన్నారు. సభ్యులు తమ పొదుపుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు పొంది, చిన్న తరహా వ్యాపారాలు లేదా వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవచ్చు అని వారు సూచించారు. అదేవిధంగా ఉపాధ్యక్షులు ఎలకుర్తి రమేష్ మాట్లాడుతూ... ఈ సంఘాలు ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు, సభ్యులకు సామాజిక, ఆర్థిక నిర్ణయాలలో భాగస్వామ్యం కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు ఇస్నాతి మహేందర్, పూజారి మల్లేష్, రాకల మల్లేష్, కటిక కృష్ణాజి, ముష్టి నరసింహులు, వివిధ గ్రామాల పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుకు ఘనంగా సన్మానం..

● సన్మానించిన బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య..





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ను ఆయన నివాసంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి బోకె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాజ్ భూపాల్ గౌడ్, అందే బాబయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి విశాల భవిష్యత్ ఉంది. రామచందర్ రావు నేతృత్వంలో పార్టీ మరింత శక్తివంతంగా ఎదుగుతుంది. పార్టీ పట్ల ఆయన అంకితభావం, కార్యశీలత కార్యకర్తలకు ప్రేరణగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు హరిభూషణ్, బోయ కురుమయ్య, పసుపుల ప్రశాంత్, రఘురాములు గౌడ్, మోటీ శ్రీను, జమ్ముల నర్సింహ, పద్మ కృష్ణయ్య, గట్టోజు విజయ్ శంకర్ రెడ్డి, రవి నాయక్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు కూడా రామచందర్ రావును శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి





**తొలి అక్షరం/పాపన్నపేట, జులై 3:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పిఆర్సిని వెంటనే ప్రకటించాలని తపస్ మండల శాఖ అధ్యక్షుడు మంగ నరసింహులు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ లు డిమాండ్ చేశారు. గురువారం పాపన్నపేట మండల పరిధిలోని వివిధ పాఠశాలలు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు, వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 53 శాతం పిఆర్సి ప్రకటించాలని, పెండింగ్ డిఏ లు చెల్లించాలని, సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ ప్రవేశపెట్టాలని, ఉద్యోగులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సిఆర్పిల సమ్మె కాలపు జీతాలను ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి, తులసిరాం, రాజశేఖర్, ప్రవీణ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కందుల మినీ కిట్స్ పంపిణీ



**తొలి అక్షరం/దంతాలపల్లి జులై 03:** దంతాలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం రోజు జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కందుల మినీ కిట్స్ పంపిణీ కార్యక్రమం పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాము,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుగులోత్ భట్టు నాయక్,చేతుల మీదుగా, మండల వ్యవసాయ అధికారి వాహిని ఆధ్వర్యంలో కందుల మినికిట్స్ పంపిణి జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొనడం జరిగింది.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం సుఖ్యతండా, బాబుల్ నాయక్ తండా, ధర్మారం, బిల్యా నాయక్ తండా, మల్కాపూర్, ముల్కలపల్లి, దాత్తయి పల్లి, గుజ్జ వాని కుంటా తాండలలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య. వీరివెంటా కాంగ్రెసు పార్టీ మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవ(జూలై 3) సందర్భంగా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తిపాటి మంజుల మాట్లాడుతూ మన ముందు తరం వారు.. బయటికి వెళ్లేటప్పుడు కూడా ఓ వస్త్రంతో కుట్టిన సంచిని తీసుకెళ్లేవారు. మరిప్పుడు.. ఇంటి నుంచి ఉత్తి చేతులతోనే వెళ్లి షాపింగ్? చేస్తాం. ప్లాస్టిక్? బ్యాగులో వేసుకొని ఇంటికి మోసుకొస్తాం. ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్? రక్కసిని ఇలా పెంచిపోషిస్తున్నాం. చివరికి నేలంతా ప్లాస్టిక్ మయం చేస్తున్నామని అన్నారు.ఈ పాపం మన అందరిది కనుక ప్లాస్టిక్ వాడకం మనమే మానివేస్తే కొనేవారు లేక తయారీదారులు ప్లాస్టిక్ కంపెనీలు మూసివేస్తారు అని అన్నారు.



## భారత్ టుడే రిపోర్టర్ శ్రీనివాస్‌ను పరామర్శించిన తెలంగాణా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, భారత్ టుడే స్టాఫ్ రిపోర్టర్ భువనగిరి శ్రీనివాస్ తండ్రి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైనారు. గురువారం రోజున వారి ఇంటికి వెళ్లి పరమార్శించి మనో ధైర్యాన్ని కల్పించిన తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా. వారితో పాటు యాదగిరిగుట్ట టీజేయు మండల అధ్యక్షులు రాజు, సీనియర్ జర్నలిస్టు హనుమంతులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మొహరం పండుగ



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట బీసీ కాలనీలో గురువారం రోజున అంగరంగ వైభవంగా మొహరం పండుగను గడ్డం చంద్రం గౌడ్, గుండు నరసింహ గౌడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ భరత్ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ పపట్ల నరహరి, మత పెద్దలు గౌస్, చోటు, ఇమ్రాన్, కాలనీవాసులు సంగం దశరథ కోట కర్ణాకర్ ,ఎల్లా గౌడ్ ,దాసు, రజినీకాంత్ ,నాగరాజు, కాటబత్తిని శీను, నవీన్, చింటూ, శివ ,శ్యామ్, రమేష్ కుమార్ ,గడ్డం మణిదీప్ ,ప్రతీక్ ,గుండు మనీ, మధు, సంతోష్, అరిసెల నాగరాజు, వేణు, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## బాలా కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవు

**- అదనపు కలెక్టర్ భాస్కరరావు**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** ముస్కాన్ ఆపరేషన్ లో భాగంగా గురువారం రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని బడిలో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ ఆచరణలో ఉంటుందని ఒకవేళ ఎవరైనా బాలలు దొరికితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

## వంగపల్లిలో స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,జులై 03:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో గల స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాలలో గురువారం రోజున ఆప్టివల్ హెల్త్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మెడ్‌ప్లస్ హెచ్.ఆర్. మేనేజర్ ఎండి తాజుద్దీన్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొత్తం 52 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల సబ్జెక్టు స్కిల్స్, రాత పరీక్ష, వ్యక్తిగత మౌఖిక పరీక్ష మరియు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ద్వార 27 మంది అభ్యర్థులను ఎంపిక చేసారు. ఎంపికైన అభ్యర్థులకు కళాశాల డైరెక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె హేమమాలిని, విద్యా సలహాదారు కె రాజిరెడ్డిల ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# అభివృద్ధికి ఆమడ దూరంలో ఆత్మకూరు(ఎం)మండలం

**టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం**

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలు గడుస్తున్న హామీలకే పరిమితం
- గత పాలకులు నేటి పాలకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చి గద్దనెక్కుతున్నారు నేటికీ బునాది గాని కాలువ బీటలు తప్ప రైతులకు వ్యవసాయానికి అందని సాగునీరు
- నేటికీ గ్రామ గ్రామాలకు కనెక్టివిటీ లేని బీటీ రోడ్లు ఆర్టీసీ బస్సును చూడని పల్లెలు ఆత్మకూరు(ఎం) మండలంలో ఉన్నాయి
- పల్లెల్లో శిలాఫలకాళ్ళకే పరిమితమైన ఆరోగ్య ఉప కేంద్రాలు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడక ముందు హరీష్ రావు ఆత్మకూరు(ఎం)మండలం విచ్చేసి ఎన్నికల హామీల్లో మా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులలో బునాది గాని కాలువ ద్వారా నీరు అందిస్తామని ఓట్లు వేసుకొని గద్దెనెక్కి పది సంవత్సరాలు మోసం చేశారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం మేము బునాది గాని కాలువ ద్వారా నీరు అందిస్తాం చెప్పి గద్దెనెక్కి18 నెలలవుతుంది. బునాది గాని కాలువ పూర్తి చేయలేదు. నీరు అందించలేదు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నీళ్ల ఐలయ్య అని పేరు చెప్పుకుంటూ పబ్బం గడుపుతున్నారు. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నాయకుల్లారా ఇప్పటికైనా మీ నాయకునితో మాట్లాడి ఈ మండలానికి ఉన్న ప్రధాన సమస్యలన్నీ కూడా నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం. లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతుల తోటి కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందనీ భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి పత్రికల వారితో మాట్లాడుతూ తెలిపారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విజ్ఞాన భారతి విద్యార్థులు

- విద్యార్థి అన్ని రంగాల్లో సర్వతోముఖాఅభివృద్ధి సాధించాలి
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కినపల్లి సతీష్ కుమార్





**తొలి అక్షరం/పర్వతగిరి జూన్ 3:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కేంద్రంలో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం హనుమకొండ నందు జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో మండలంలోని చింత నెక్కొండ గ్రామం విజ్ఞాన భారతి విద్యాలయం విద్యార్థులుఅండర్ 14 ట్రైత్లిన్ విభాగంలో తోకల రిత్విక్ మరియు అండర్ 12, రన్నింగ్ విభాగంలో పస్తం శివకుమార్ లు పాల్గొని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ అక్కినపెల్లి రజిత-సతీష్ కుమార్ లు తెలిపారు. వీరు ఈనెల 6న హనుమకొండలో జెఎన్ఎస్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజ మాన్యం, పీఈటి భూక్య సురేష్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

# గడపగడపకు కాంగ్రెస్ సంక్షేమ పథకాలు

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు
- దోర్నకల్‌లో కొన్ని కోట్ల అభివృద్ధి పనులు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ
- మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్



**తొలి అక్షరం/నర్సింహులపేట, జూలై 03:** కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా మండల యూత్ నాయకులు కృషి చేయాలని మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నం శ్రీకాంత్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీలులో భాగంగా 200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతు భరోసా రైతులు పండించిన సన్న రకానికి బోనస్, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఈ విధంగా ఇచ్చిన మాట ప్రకారం ఎన్నో హామీలు అమలుపరిచి ప్రజల మన్నన పొందడం జరిగిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

- పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకుయాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక
- ముఖ్య అతిథులుగా బిర్రు మహేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ నల్ల చంద్రస్వామి మాదిగ



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ మాజీ మండల నాయకులు బొట్టు ప్రభాకర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిర్రు మహేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి నల్ల చంద్రస్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ జన్మదిన వేడుకలు మరియు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని మాదిగలకు మరియు ఉపకులాలకు పిలుపునివ్వడం జరిగింది. అనంతరం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ వేయడం జరిగింది. గ్రామంలో ఉన్నటువంటి మాదిగలు మాదిగ ఉపకలాలు అధిక సంఖ్యలో హాజరై జూలై ఏడో తారీఖు నిర్వహించబోయే మాదిగల ఆత్మగౌరవ పతాక దండోరా ఆవిర్భావ జన్మదిన వేడుకలను మరియు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా జరపాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్ పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,ఎంఎస్పి జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ,ఎమ్మెస్పీ జిల్లా నాయకులు మండల ఇంచార్జీ భూడిద జానీ మాదిగ,ఎంఎస్పి మండల అధ్యక్షులు సుంచు ప్రేమ్ కుమార్ మాదిగ, బొట్టు ప్రభాకర్ మాదిగ,కన్నాయి అంజి మాదిగ,కన్నాయి పాండు మాదిగ, మోత్కూపల్లి రాజు మాదిగ,ములుగు రవి మాదిగ,ములుగు జంగీర్ మాదిగ,కన్నాయి రాములు మాదిగ,మోత్కూపల్లి నరసింహులు మాదిగ,కన్నాయి విజయ్ కుమార్ మాదిగ,పూలేపాక కిరణ్ మాదిగ, పూలేపాక రాజన్ మాదిగ,కన్నాయి ఎల్లయ్య మాదిగ, పూలేపాక ఎల్లయ్య మాదిగ,మోత్కూపల్లి ఎల్లమ్మ మాదిగ, కన్నాయి జయ మాదిగ,పూలేపాక అండాలు మాదిగ, బొట్టు కిష్టమ్మ మాదిగ, తదితర కుల పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

# గుంతల మాయమైన రోడ్లలో వరి నాట్లతో సిపిఎం నిరసన

- దుబ్బాక గ్రామంలో ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే పూడ్చి నూతన రోడ్డు వేయాలి





**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** దుబ్బాక గ్రామంలో గుంతల మయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న రామన్నపేట -అమ్మనబోలు ప్రధాన రోడ్డును నూతనంగా నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడాలని సిపిఎం మండల కమిటీ సభ్యుడు మేడి గణేష్, శాఖ కార్యదర్శి గుండాల ప్రసాద్ డిమాండ్ చేశారు. దుబ్బాక గ్రామ సిపిఎం ఆధ్వర్యంలో చెరువును తలపిస్తున్న రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలపడం జరిగింది . ఈ సందర్భంగా మాట్లాడుతూ రామన్నపేట- అమ్మనబోలు రోడ్డు వర్షాలకు గుంతల మయంగా మారి ప్రమాదాలు కు కారణమవుతుందని అనేకసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఫలితం లేకుండా పోతుందని వర్షం వస్తే రోడ్లు మొత్తం చెరువుమయంగా మారి ప్రజలు ఇబ్బందిగా మారుతున్నారని వెంటనే అధికారులు నూతన రోడ్డు వేసి దుబ్బాకలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను వెంటనే యుద్ధ ప్రాతిపదికన తక్షణ మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామ ప్రజలను సమీకరించి రామన్నపేట ఆర్%డ%బి కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గట్టు నరసింహ, పైళ్ళ పాపయ్య,డివైఎఫ్ఐ నాయకులు గుండాల నరేష్, గుండాల అనిల్, పుట్టల ఉదయ్ కుమార్,గాదె రాజకుమార్,గట్టు సుందర్, పైళ్ల లింగస్వామి,గుండాల అక్షిత,గట్టు రమణ,గుండాల సాయి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సభ

- సభ ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేసిన ఎమ్మెల్యే డా మురళీ నాయక్





**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జులై 3:** ఈ నెల 06 తారీఖున పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి మహబూబాబాద్ నియోజకవర్గనికి విచ్చేస్తున్న సందర్భంగా గురువారం సభ ఏర్పాట్లను మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్, డిసిసి అధ్యక్షులు జన్నా రెడ్డి భరత్ చందర్ రెడ్డి, డీఎస్పీ, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే డా మురళీ నాయక్ మాట్లాడుతూ సభకి వచ్చే ప్రజలకి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ ఉండేలా హ్యాంగర్స్ ఏర్పాటు చేయాలని, త్రాగు నీరు, చల్లని త్రాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికంగా వాహనాలు వస్తాయి కాబట్టి ట్రాఫిక్ ని నియంత్రించాలని పార్కింగ్ స్థలాలకి అప్రోచ్ రోడ్లు శనివారంలోగా పూర్తి చేయాలని అన్నారు. ప్రజలకు మజ్జిగ, చల్లని త్రాగునీరు అందుబాటులో ఉండాలన్నారు. పోలీసు బందోబస్త్, ట్రాఫిక్ నియంత్రణ చాల ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు,మండల నాయకులు,పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఎస్సి విద్యార్థులకు మెరిట్ బహుమతులు

**• నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉత్తమ ప్రతిభ అవార్డులు...**

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జులై 3:** జడ్పిహెచ్ఎస్ ,కంబాలపల్లి పాఠశాలలో స్థానిక ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్ రెడ్డి చొరవతో నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు నూకల మహేందర్ రెడ్డి 2024 పదవ తరగతి పరీక్షలలోఅత్యధిక మార్కులు సాధించిన వెంపటి విఘ్నేశ్ 565 మార్కులు 10000 రూపాయలు, ధనుంజయ్ 554 మార్కులు.6000 రూపాయలు, శివ కుమార్ 534 మార్కులు 4000 రూపాయలు, 500 మార్కులు దాటిన 8 మంది విద్యార్థులకు 1000 రూపాయలు మెమోటో సర్టిఫికెట్ అలాగే పాఠశాల లలో చదివి జేఈఈ 2025 లో ఐఐటి సీట్ వచ్చిన విద్యార్థులు సాయి లేఖ్య, ప్రశాంత్ లను సన్మానం చేయడం జరిగింది. సభాధ్యక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ఉప్పలయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో ఏ రవీందర్ రెడ్డి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులు మెచ్చేలా పాఠశాలకు వన్నెతెచ్చేలా విద్యార్థిని విద్యార్థులు కృషి చేయాలని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రతిభ ఎవరి సొత్తు కాదని ప్రతిభ కలవారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని



ఆ విధంగా విద్యార్థులు కృషి చేయాలని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని, విద్యార్థినీ, విద్యార్థులు పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదివి అర్థం చేసుకుంటే పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని బీర్ గ్రూప్ లెర్నింగ్ వలన విద్యార్థులలో ప్రతిభ వెలికి తీయబడుతుందని లిటిల్ టీచర్ విధానాన్ని అవలంబించి విద్యార్థిని విద్యార్థులు తన యొక్క ప్రతిభను సృజనాత్మకతను మెరుగు దిద్దుకుంటే ఉన్నత స్థాయిలో ఉంటారని దానికి ఈరోజు ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులే నిదర్శనమని తెలియజేశారు, ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు దాతలు సహాయం చేయడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా దాత సోదరుడు రిటైర్ ఎయిర్ కమాండర్ నూకల నరేందర్ రెడ్డి హాజరై పిల్లలను ఉద్దేశించి ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు ఉపాధ్యాయుల యొక్క సేవలను వినియోగించుకొని మంచి ర్యాంకులు సాధించాలని కోరడం జరిగింది. శారీరక వ్యాయామంతో పాటు పోటీ తత్వాన్ని పెంపొందించుకున్నప్పుడు విద్యార్థులు ఉన్నత స్థాయిలోకి చేరుకోగలరని విద్యార్థిని, విద్యార్థులు శాస్త్రవేత్తలు, అంతరిక్షయోమగామిలుగా ఉన్నత స్థాయిలో కి చేరుకోవాలని సూచించారు. కంబాలపల్లి ఉన్నత పాఠశాల విశ్రాంతి ఉపాధ్యాయుడు సుదర్శన చారి మూడు వేల రూపాయల నగదును పాఠశాలకు తెలుగు మీడియం విద్యార్థులకు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి అప్పారావు అమ్మ అదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ , విద్యా కమిటీ మాజీ చైర్మన్ చిరంజీవి,ఉపాధ్యాయులు జి. ఉప్పలయ్య, సోహన్ బి, కాసం శ్రీనివాసరావు, తిరుపతి,సతీష్ కుమార్, సోమేశ్వర్, ఓ ఝాన్సీ, వీరభద్రం, కవిత, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు.%దీ%.కృష్ణమూర్తి వెంకటేశ్వర్లు , ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి లక్ష్మి ఉపాధ్యాయులు ఆవునూరి రవి, కంబాలపల్లి గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభ్యాసన నైపుణ్యాలు, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**• అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలి • జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూలై 3:** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, గురువారం మండల ప్రజా పరిషత్ అప్పర్ ప్రైమర్ స్కూల్, బ్రాహ్మణపల్లి, (లక్ష్మీపురం), మండల ప్రజా పరిషత్ స్కూల్ కొమ్ముగూడెం లలోని పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.పాఠశాల ఆవరణంలో సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు,ఈ సందర్శనలో విద్యార్థుల హాజరు, అభ్యాసన సామర్థ్యాలు, తరగతి గదుల్లో బోధనా పరిస్థితులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు.విద్యార్థుల పఠనాభివృద్ధికి పాఠశాలలు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ అభినందించారు. ప్రత్యేకంగా కొమ్ముగూడెం పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా కలెక్టర్ ఒక మొక్కను నాటినారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దడం జరుగుతుందని, అనేక సౌకర్యాలు కల్పిస్తూ అత్యుత్తమ సాంకేతిక విద్య బోధనలు అందించడం కోసం విద్యాశాఖను బలోపేతం చేస్తుందని అన్నారు, "పిల్లల



అభ్యాసన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేయాలి అని పాఠశాలలు ఉత్తమ పాఠశాలలుగా మారాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం" అని ప్రభుత్వ విద్యా సంస్థలలో తమ పిల్లలను చేర్పించాలని ఆయన పేర్కొన్నారు.పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు ,అదనపు తరగతి గదుసుల నిర్మాణం వేగంగా చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు,పాఠశాల ఆవరణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు ప్రభుత్వ సూచించిన మోనో ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని




అందించాలని సూచించారు,ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని,జిల్లా విద్యాశాఖ అధికారి డా. రవీందర్ రెడ్డి, మాట్లాడుతూ విద్యార్థులలో తగిన నైపుణ్యాలు, విలువలు, భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సర్దార్ నగర్ గ్రామ పంచాయతీ సుపరిపాలన కితాబు






**తొలి అక్షరం/షాబాద్, జులై 03:** సర్దార్ నగర్ గ్రామం యొక్క పరిపాలన, పౌరసేవలు, వివిధ పథకాల అమలు బాగుందని తమిళనాడు బృందం కితాబు ఇచ్చింది. MCRHRD ద్వారా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సుపరిపాలన కేంద్రం) శిక్షణ బృందం అనిల్ కుమార్, వెంకట రమణలు తమిళనాడు సర్పంచులు, బ్లాక్ అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారుల బృందంతో కలిసి గురువారం నాడు గ్రామంలో పలు విధాల సౌకర్యాలను, వనరులను సందర్శించి అక్కడ అభివృద్ధిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలను నాటి గ్రామ పంచాయతీ భవనం, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్ మరియు పల్లె ప్రకృతి వనాలు సందర్శించి చాలా చక్కగా ఉన్నాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీ దీపాల శ్రీనివాస్, సర్దార్ నగర్ సెక్రటరీ విజయసింహ, సంకేపల్లిగూడ సెక్రటరీ ఫయాజ్, అంతారం సెక్రటరీ రాజేందర్, కక్లూర్ సెక్రటరీ రాజేందర్, నారెడ్లగూడ సెక్రటరీ ఆశ్రిత, బోడంపహాడ్ సెక్రటరీ స్నేహ లత, కొమరబండ సెక్రటరీ శంకర్ , మరియు గ్రామస్తులు శ్రీమతి పల్లటి అశ్వినీ, మర్పల్లి అరుణ, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, గ్రామ వోల్ మయూరి, అనమ్ విజయలక్ష్మి, ఆశా వర్కర్లు మాధవి, సులోచన తదితరులు గ్రామంలో పలు శాఖల పనితీరు ద్వారా జరిగిన గ్రామ అభివృద్ధిని తమిళ బృందానికి వివరించారు.


# బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు డా.కే.లక్ష్మణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** భారతీయ జనతా పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు శ్రీ డా. కే. లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్ రెడ్డి గతంలో లక్ష్మణ్ నాయకత్వం లో తెలంగాణా విమోచన కమిటీ చైర్మన్ గా నాకు అవకాశం ఇచ్చారని, అప్పుడు నిర్వహించిన విమోచన యాత్ర ద్వారా తెలంగాణా లోని ప్రతీ గ్రామానికి చరిత్ర తీసుకువెళ్లే విధంగా, ఢిల్లీ స్థాయి లో తెలంగాణా విమోచన చరిత్ర తెలిసే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తుచేసుకున్నారు. మోడీ ప్రభుత్వం తెలంగాణా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా చేపట్టడంలో అనేక బీజేపీ నాయకుల పోరాటంలో చివరిగా లక్ష్మణ్ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వారి జన్మదినం సందర్భంగా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలు ప్రసాధించాలని బీజేపీ లో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని శ్రీవర్ధన్ రెడ్డి కోరారు.



## రామన్నపేటలో నూతన కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు....



**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** రామన్నపేట మండల కేంద్రంలో నూతనంగా నాలుగు కోర్టుల భవన నిర్మాణ సముదాలకు 29 కోట్ల రూపాయలు దీనితో పాటు అధికారుల నివాస సముదాయం నిర్మాణానికి ఐదున్నర కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. మండల కేంద్రంలోని కొమ్మాయిగూడెం రోడ్డులో గల సభన్ బోర్డు వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన కోర్టు భవనాలకు నిధులు మంజూరుకు అహర్నిశలు కృషిచేసిన హైకోర్టు జడ్జిలకు, దీనికోసం ప్రయత్నం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా రామన్నపేట బార్ అసోసియేషన్ తరపున బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఏ.మజీద్, మరియు కార్యవర్గ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సిరిపురం పాల సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన సిల్వేరు వెంకటయ్య




**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** సిరిపురం పాల ఉత్పత్తిదారుల సంఘంలో జరిగిన ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి సిల్వేరు వెంకటయ్య నూతన ఛైర్మన్ గా ఎన్నిక కావడం జరిగింది . ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ పాల రైతుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, సంఘాన్ని లాభాల బాటలో పయనించేలా మరింత ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఎన్నికకు సహకరించిన పాల ఉత్పత్తిదారులకు డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. నూతన చైర్మన్ గా ఎన్నికైన వెంకటయ్యకు సిపిఎం నాయకులు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ పాల సంఘం చైర్మన్ లు తదితర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## 4న కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలి

**- యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్**



**తొలి అక్షరం/నరసింహుల పేట జూలై 03:** జూలై 4న, హైదరాబాదులోని లాల్ బహదూర్ స్టేడియం ప్రాంగణంలో, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో భారీ బహిరంగ సభను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించబోతోంది అని మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఓరుగంటి శ్రీకాంత రజక అన్నారు ఇ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క జాటోత్ రామచంద్రు నాయక్ఉపసభాపతి,తెలంగాణ శాసనసభతెలంగాణ ప్రభుత్వ విప్‌డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు.రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, శాసన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, గ్రామ శాఖల నాయకులు హాజరుకానున్నారు.ఈ సభను విజయం వైపునకు నడిపించేందుకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై, కాంగ్రెస్ పార్టీకి బలముగా నిలవాలని కోరుతున్నాను.

## మాసుకుంటలో ఘనంగా మొహర్రం పండుగ వేడుకలు

**- డొప్ప బాలకృష్ణ,మాజీ వార్డు సభ్యులు నీల పద్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యకమాలు**

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 03:** త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలను భువనగిరి పట్టణం మాసుకుంటలో డొప్ప బాలకృష్ణ, మాజీ వార్డు సభ్యులు నీల పద్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పీర్లను కాలనీలో ఊరేగించగా కుల మతాలకు అతీతంగా అందరూ పాల్గొని పూజించారు. ఈ సందర్భంగా డొప్ప బాలకృష్ణ మాట్లాడుతూ త్యాగానికి ధైర్యానికి అణిచివేతలకు వ్యతిరేకంగా ఉన్నత విలువలను చాటి చెప్పేదే మొహర్రం పండుగ అని హిందూ ముస్లింలు కలిసి జరుపుకునే మొహర్రం పండుగ ఎంతో విశిష్టత కలిగినదని అన్నారు. ముస్లింల పండుగ అనే కాకుండా మతసామరస్యాన్ని ప్రతిబింబించే వేడుకగా నిలుస్తుందని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పల కరుణాకర్, శ్యామల బాలకిషన్, భక్తులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# అధ్యక్షుల వారి ఆత్మీయ ఆలింగనం

**- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రాంచందర్ రావుకి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా శ్రీ రాంచందర్ రావు ని తార్నాకలో వారి స్వగృహం లో కలిసి షాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రాంచందర్ రావు గారు విష్ణువర్ధన్ రెడ్డి ని ఆత్మీయ ఆలింగనం చేసుకొని పలకరించడం జరిగింది.విష్ణువర్ధన్ రెడ్డి గారితో పాటు బిజెపి సీనియర్ నాయకులు విజయ్ బాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, పసుల నర్సింహా యాదవ్, చేగు సుధాకర్ అప్ప, బల్వంత్ రెడ్డి, మల్ రెడ్డి మహేందర్ రెడ్డి, కొత్తూరు, చౌదరి గూడ మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి, ఏదిర రాజు,శ్యామ్ సుందర్ రెడ్డి, రంగన్న గౌడ్, కరెడ్ల నరేందర్ రెడ్డి, బోయ అశోక్, కుమ్మరి మహేష్, అనిల్ కుమార్ గౌడ్, సుదీర్ పటేల్, గణేష్ నాయక్, భక్త వత్సల్ , చౌడం శ్రీనివాస్, రాజు నాయక్, తదితరులు ఉన్నారు.

## భారతీ నగర్ డివిజన్‌లో యువకులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

**- పాల్గొన్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**



**తొలి అక్షరం/సంగారెడ్డి , జూలై 03 :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని భారతినగర్ డివిజన్ వార్డ్ కార్యాలయంలో జీ.హెచ్.ఎం.సి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సొసైటీలకు చెందిన యువకులకు, సభ్యులకు ఆటలకు అవసరమైన క్రీడా సామగ్రిని కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరం. క్రీడల ద్వారా శారీరక ధృడతతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. భవిష్యత్తులో మరిన్ని క్రీడా అభివృద్ధికి తగిన ప్రోత్సాహం కల్పించేందుకు కృషి చేస్తాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి..

**- ముగ్గురిపై హత్య యత్నం**

**కేసు నమోదు: ఎస్ఐ తిరుపతి**

**తొలి అక్షరం/బయ్యారం, జూలై 3:** మండలంలో బిగ్ న్యూస్ చానల్ రిపోర్టర్ పిల్లల నరసింహారావు పై బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బయ్యారం నుండి గంధంపల్లి ప్రదాన రహదారి పై వెళుతుండగా మార్గమధ్యంలో అలిగేరి బ్రిడ్జి సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు టు వీలర్ వాహనం ఆపి దాడి చేయడంతో,తీవ్ర గాయాలైనట్లు తెలిపారు.దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్.ఐ తిరుపతి విచారణ చేపట్టి దాడి చేసిన ముగ్గురిపై హత్య యత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



# జిల్లాలో సీజనల్ వ్యాధుల కట్టడికి పటిష్ట చర్యలు







**● కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి(మహేందర్),జూలై3:** వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.**ప్రజల్లో అవగాహన పెంపొందించాలి:** కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. చికున్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.**పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలపై ప్రత్యేక దృష్టి:** గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలను అధికారులు సందర్శించి పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా పట్టణ ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లలో వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని, సంబంధిత ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలో ఉపయోగం లేని వస్తువులను తొలగించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని ఎంఈఓలు, మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు వాట్సాప్ గ్రూపులలోనూ సమాచారాన్ని పోస్ట్ చేయాలన్నారు. నీరు నిల్వ ఉండి లార్వా వృద్ధి చెందకుండా నిరోధించాలని, గ్రామ పంచాయతీలలో ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు కనీసం ఒక వార్డును తనిఖీ చేసి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థల్లో మంచినీటి వసతి, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించాలని, వంట చేసే ప్రదేశంలో, వడ్డించే వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతనూ పాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతి గురువారం పరిసరాలను పరిశీలించి, ఏవైనా నీటి నిల్వలు ఉన్నట్లయితే తొలగించాలని సూచించారు.**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సన్నద్ధత:** ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశామని, వర్షాకాలం దృష్ట్యా డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశామని, వందరోజుల ప్రణాళికను రూపొందించి 24/7 పనిచేయనున్నట్లు వివరించారు.**అధికారుల వివరణ:** సీజనల్ వ్యాధుల పట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యల గురించి డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

# ఏకు శ్రీవాణి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం

**● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హామీ**






**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి (మహేందర్), జూలై3:** హనుమకొండ జిల్లా, పరకాల మండలం, మల్లక్కపేట గ్రామం శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు.గత మూడు రోజుల క్రితం వసతి గృహంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఏకు శ్రీవాణి మృతికి గల కారణాలను పాఠశాల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఇలాంటి అనుకోని సంఘటన జరగడం చాలా బాధాకరమని అన్నారు.ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, లోపాలను గుర్తించి, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీవాణి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు.

# వరంగల్ క్లబ్‌లో డా. రమేష్ కుమార్‌కి ఘన సత్కారం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై3:** ప్రముఖ ఈఎన్‌టి శస్త్ర వైద్యుడు, కాకతీయ మెడికల్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ కి ఆయన జన్మదినం సందర్భంగా వరంగల్ క్లబ్ ప్రాంగణంలో ఘన సత్కారం జరగడం విశేషం. ఈ కార్యక్రమంలో క్లబ్‌కు చెందిన అనేకమంది షటల్ బ్యాడ్మింటన్,టెన్నిస్ క్రీడా కారులు పాల్గొన్నారు.డా. రమేష్ తన వినయశీలత, మానవీయత, రోగుల పట్ల చూపించే మార్మికత, ఎల్లప్పుడూ చిరు నవ్వుతో వైద్య సేవలందించడంలో ఉన్న గొప్పతనం కారణంగా అందరి అభిమానాన్ని పొందారు.ఆయన విభిన్న సామాజిక, వైద్య కార్యక్రమాల్లో నిబద్ధతతో సేవలందిస్తున్న తీరు ప్రశంసనీయం.వైద్య వృత్తితోపాటు, నృత్యం సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆయనకున్న ఆసక్తి ప్రత్యేకంగా గుర్తించదగ్గది. ఆరోగ్య పరిరక్షణపై ఆయన చూపే శ్రద్ధను ప్రతి ఒక్కరు అభినందించారు.ఆయన రోజూ షటల్ ఆడటం, ఈత తీయడం వంటి శారీరక చురుకుదనం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, తన వైద్య బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న సభ్యులు డా. రమేష్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో కూడిన సుదీర్ఘ జీవితం కలగాలని, భవిష్యత్ కార్యాచరణల్లో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పింగళి వెంకటేశ్వర రావు, డా.ఎర్రగట్టు స్వామి,చిల్పూరి రాజేందర్,తోకల బాబు రెడ్డి,అభిషేక్,కుంజ్ బిహారి,నిమ్మ మోహన్ రావు,తొలి అక్షరం పత్రిక ఎడిటర్ పస్తం సైదులు తదితరులు పాల్గొన్నారు.



# చలో హైదరాబాద్‌లి సభను విజయవంతం చేయాలి

**● గ్రామ స్థాయి కార్యకర్తలతో వినూత్న రీతిలో సమావేశం ఏర్పాటు శుభపరిణామం**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి(మహేంద్ర),జూలై3:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ భవన్‌లో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మరియు పశ్చిమ వరంగల్ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా జరుగనున్న సంవిధాన్ పరిరక్షణ శంఖారావం సభ విజయవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు.ఈ సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశమవనున్నారు.ఈ వినూత్న కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు నూతన స్ఫూర్తిని అందించడానికీ దోహదపడనుందని నేతలు అభిప్రాయపడ్డారు.సభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి బస్సులు, వాహనాల ఏర్పాట్లతో పాటు కార్యకర్తల భద్రత, నిబంధనలు, సమయ పాలన తదితర అంశాలపై చర్చించి తగిన విధంగా కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు.కాంగ్రెస్ శ్రేణులు ఈ సభను ఒక చారిత్రక విజయంగా మార్చే దిశగా కృషి చేయాలని కోరుతూ డీసీసీ నాయకత్వం పిలుపునిచ్చింది.అసెంబ్లీ నియోజవర్గాలకు ఇంచార్జ్ లుగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ,టీపీసీసీ ప్రధాన కార్యదర్శిలు దుద్దిళ్ల శ్రీను బాబు,పల్లె శ్రీనివాస్ గౌడ్,మోత్కూరి ధర్మారావు లతో కలిసి చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు.

# సుందరగిరి శ్రీనివాస్ రావుకి తొలి అక్షరం ఎడిటర్ పస్తం సైదులు ఘన సత్కారం

**● సంస్కృతిపర కార్యక్రమంలో పలువురు ప్రముఖుల పాల్గొనటం విశేషం**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై3:** వరంగల్,ఖమ్మం జిల్లాలకు ఇటీవలే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు పోలీసు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన 1991 బ్యాచ్ పోలీస్ అధికారి సుందరగిరి శ్రీనివాస్ రావు ని తొలి అక్షరం పత్రిక ఎడిట్ ఎడిటర్ పస్తం సైదులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డా. సైదులు మాట్లాడుతూ "తొలి అక్షరం పత్రిక నిష్పక్షపాతంగా ప్రజలకు సమగ్రమైన సమాచారం అందించడమే ధ్యేయంగా పనిచేస్తోందనీ తెలిపారు.శ్రీనివాసరావు అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మరింత బలోపేతం అవుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు సుందరగిరి నిబద్ధత, నిజాయితీ, మరియు వృత్తిపట్ల ఆయనకున్న అంకిత భావం అభినందనీయమని సైదులు కొనియాడారు.ఈ కార్యక్రమం సాంస్కృతిక విలువలతో కూడినది కావడంతో పాల్గొన్న ప్రతిఒక్కరిలో ఉత్సాహం నెలకొంది.ఈ సత్కారంలో పలువురు ప్రముఖులు పింగళి వెంకటేశ్వర రావు,డా. రమేష్ కుమార్, డా.ఎర్రగట్టు స్వామి,చిల్పూరి రాజేందర్,తోకల బాబు రెడ్డి,అభిషేక్,కుంజ్ బిహారి,నిమ్మ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిట్ జరగాలి

పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ఇది ఒక్క పాశమైలారం గురించే కాదు... దేశమంతా ఇదే దుస్థితి నెలకొంది. ప్రధానంగా ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు వ్యవహారం సద్దుమణిగాక పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ప్రమాదాల్లో ఎంతమంది మరణించారో కూడా లెక్కలు తెలియడం లేదు. సరికదా తెలుసుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి నిత్యం వల్లెవేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా భారీ పరిశ్రమలన్నింటిలో రెగ్యులర్‌గా సేఫ్టీ ఆడిట్ చేయించాలి. పని పరిస్థితులను మెరుగుపరచాలి. పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరిగే పారిశ్రామిక వాడలు ఉన్న ప్రాంతాల్లో వంద పడకల బర్న్స్ వార్డులతో కూడిన ఆసుపత్రులు నిర్మించాలి. ప్రతి నెలా అన్ని పరిశ్రమల్లోనూ తనిఖీలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అనుసరించేలా ఒత్తిడి తేవాలి. ఇప్పటికే పాశమైలారంనకు సంబంధించి అనేకమంది బాధితులు ఆస్పత్రి ముందు వచ్చి రోదిస్తున్నా..స్పందించడం లేదు. మావారు ఏమయ్యారన్న ప్రశ్నలకు సమాశానం రావడం లేదు. ప్రమాదం జరిగిన సోమవారం నాడు పరిశ్రమలోకి ఎంతమంది వెళ్లారనడానికి సరైన లెక్కలు లేవు. దీనికి కూడా కారణం ఉంది. మనుషులతో పాటు, రికార్డులు కూడా బుగ్గికావడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ చరిత్రలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రమాదంగా సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ దుర్ఘటన నిలిచిపోయింది. ఇప్పటికి 40 మంది కార్మికులు మరణించగా, మరో 37 మంది తీవ్రంగా గాయపడినట్టు



గుర్తించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న 147 మందిలో మిగిలిన వారి కోసం రెండు రోజులుగా గాలింపు కొనసాగుతూనే ఉంది. కొందరి గుర్తింపు భారంగా మారింది. డిఎన్ఎ టెస్టులు కూడా కష్టంగానే మారాయి. బూడిదకుప్పల నుంచి డిఎన్ఎ టెస్టు చేయడం సాధ్యం కావడం లేదని సమాచారం. ఇకపోతే ఉద్యోగానికి వెళ్లిన వారెంతమంది అన్నది ప్రాథమికంగా తేల్చాలి. అప్పుడే ఎంతమంది చనిపోయారన్నది తెలుస్తుంది. ఎందుకంటే నవ్వుతూ ఉద్యోగానికి వెళ్లిన కార్మికులు బూడిద కుప్పలుగా మారారు. డిఎన్ఎ ఆధారంగా వారి అవశేషాలను గుర్తించాల్సిన దుస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే తమవారు ఏరీ అని అడిగే వారి కుటుంబాలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితిలో ప్రభుత్వం, అధికారులు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు. కార్మికుల భద్రతను గాలికి వదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే హైదరాబాద్ శివారు ఔషధ పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంగా చెప్పుకోవాలి. హైదరాబాద్ శివారులోని పరిశ్రమల్లోనే గత రెండు మూడు నెలల్లో నాలుగైదు ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. విశాఖలో 2020 నాటి ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం 12 మంది కార్మికులను బలిగొంటే, చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ విషతుల్యంగా మార్చి, వందలమందిని ఆసుపత్రుల పాలు చేసింది. ఆ తరువాత అచ్యుతాపురం సెజ్‌లో 2022 జూన్, ఆగస్టులో 500 మందికిపైగా మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ ప్రమాదంపై నివేదిక అమలు మాట అటుంచి వెలుగుచూసిన పాపాన పోలేదు. గత ఏడాది అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలోనే 17 మంది మరణించగా, 38 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఆరు నెలల్లోనే అనకాపల్లి జిల్లాలో జరిగిన 11 ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా, ఎనిమిదిమంది తీవ్ర గాయాలతో మంచంపట్టారు. పరవాడ ఫార్మాసిటీలో గత ఏడాది విషవాయువుల లీకేజిసహా పలు ప్రమాదాల్లో 10 మంది మరణించగా, 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలవకుండా, లాభం కోసం భద్రతను గాలికొదిలేసి ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమల అధిపతుల పక్షాన కేంద్ర, రాష్ట్ర పాలకులు నిలవడం మరింత విషాదం. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాల్లో రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నారు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతాపరమైన నియంత్రణలను బలహీనపరచడమే భారీ ప్రమాదాలకు కారణమన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ హెచ్చరికలను ఇప్పటికైనా గుర్తించి, కఠిన చర్యలకు ఉపక్రమించాలి. యాజమాన్యాలు అత్యాశతో రసాయన, ఔషధ పరిశ్రమలుసహా వివిధ పరిశ్రమల్లో అత్యంత కీలకమైన స్థానాల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేసే తగిన నైపుణ్యం, విద్యార్హత లేని వారిని, ఇతర రాష్ట్రాల వారిని కాంట్రాక్ట్, డైలీవేజ్ ప్రాతిపదికన నియమిస్తున్నాయి. కాలం చెల్లిన రియాక్టర్లు, యంత్రాలను వినియోగించడం తోపాటు వాటికి దగ్గరగా వెల్డింగ్, షోల్డరింగ్ చేయడం, యంత్రాలు, వాల్వులపై పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి భద్రతాపరమైన పరికరాలు, తగిన శిక్షణ ఇవ్వకపోవడం, భద్రతా తనిఖీలు జరగకపోవడం పలు రసాయనాలను దగ్గరగా నిల్వచేయడం తదితర కారణాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు నివేదికలు ఘోషిస్తు న్నాయి. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి, తమకు జరిగిన అన్యాయాన్ని,యాజమాన్యా ల దుర్మార్గాన్ని ప్రశ్నించలేని స్థితికి కార్మికులను నెట్టేసిన తీరు పాలకుల నిరంకుశ విధానాలకు నిదర్శనం గా చూడాలి. కార్పొరేట్లకు కొమ్ముకాయడం మాని, సేఫ్టీ వర్క్ లాంటి కార్మిక అనుకూల నినాదాలను తీసుకోవడం తక్షణ అవసరం. కార్మికుల సంక్షేమం ద్వారానే సంస్థలు బలపడాలి తప్ప, కార్మికులను పొట్టన పెట్టుకుని ముందుకు సాగాలన్న విధానాలకు పాతరేయాలి. ముందుగా తెలంగాణ, ఎపిల్లో ఉన్న పారిశ్రామిక వాడల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిటింగ్ చేపట్టాలి. ఆయా పరిశ్రమల్లో నాణ్యతాపరమైన, భద్రతాపరమైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా అన్నది విశ్లేషించాలి. అప్పుడే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలం.

---

# అమెరికా ఆంక్షలపై అధ్యయనం

- **లిండ్సే గ్రాహంతో టచ్‌లో ఉన్నాం**
- **వాషింగ్టన్ మీడియా సమావేశంలో జైశంకర్**

**వాషింగ్టన్,జూలై3:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్నుతో 'ఆర్థిక బంకర్ బస్టర్' జారవిడుస్తామంటూ అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వాషింగ్టన్‌లో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అమెరికా కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపనుండటంతో వాటిని జాగ్రత్తగా గమనిస్తున్నామన్నారు. భారత్ దౌత్య కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు ఆ బిల్లుకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న లిండ్సే గ్రాహంతో టచ్‌లో ఉన్నట్లు చెప్పారు. 'మా ఆందోళనలు, ఇంధన భద్రత ప్రయోజనాలను ఆయనకు తెలియజేసినట్లే భావిస్తున్నా. ఇక అవసరమైతే ఆ సమస్య వచ్చినప్పుడు ఎదుర్కోవాలని పేర్కొన్నారు. క్వాడ్ సమావేశంలో



పాల్గొనడానికి నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వాషింగ్టన్‌కు వెళ్లిన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ,తమ ఆందోళనలను ఆ సెనెటర్‌తో ఇప్పటికే పంచుకొన్నామని ఆయన పేర్కొన్నారు. ఆ బిల్లు వాస్తవరూపం దాలిస్తే ఎదురయ్యే ఇబ్బందులపై తమకు అవగాహన ఉందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం పరిస్థితిని మరింత జటిలం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి అమెరికా చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్ను విధించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఈ బిల్లును ప్రస్తావించే సమయంలో సెనెటర్ లిండ్సే గ్రాహం భారత్, చైనా పేర్లను ముఖ్యంగా ప్రస్తావించడం గమనార్హం. ఉక్రెయిన్‌తో చర్చలకు రష్యాను ఒప్పించేందుకు ఓ ఆయుధం వలే ఈ బిల్లును వాడాలని ట్రంప్ కార్యవర్గం భావిస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే.. రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది మన ఔషధాలు, వస్త్రాలు వంటి ఎగుమతులపై ప్రభావం చూపుతుంది. ఇక, ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే దేశాల కోసం లిండ్సే మరో ఒప్పందాన్ని ప్రతిపాదించ నున్నట్లు తెలుస్తోంది. మరో 48 గంటల్లో భారత్– అమెరికా మధ్య మినీ ట్రేడ్ డీల్ ఓ కొలిక్కి వస్తుందన్న వేళ జైశంకర్ వ్యాఖ్యలు కీలకంగా మారాయి.

# సెక్యులర్, సోషలిస్టు పదాలపై రాద్ధాంతం

రాజ్యాంగ పీఠికలో సోషలిజం (సామ్యవాదం), సెక్యులరిజం (లౌకికవాదం) పదాలను చేర్చడం మరో సిద్ధాంతపరమైన సంఘర్షణకు తెరలేపింది. 1976 లో 42వ సవరణ సందర్భంగా ఈ రెండు పదాలు పీఠికలో చేర్చబడ్డాయి. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ ప్రయోజనాల గురించి చర్చించడం విలువైనది కాగా, ఈ పరిశీలన సమయం, స్వరం గణతంత్ర రాజ్య ఆధారభూతమైన నైతిక విలువలను పునఃపరిశీలన చేయడానికి పెద్ద ప్రయత్నం జరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. రాజ్యాంగంలో ఉన్న లౌకికవాదం, సోషలిస్టు పదాలపై పునరాలోచించాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే పిలుపునిచ్చారు. మొదట ఆమోదించిన రాజ్యాంగంలో ఈ పదాలు లేవని ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ ప్రోద్బలంతో ఇవి చేర్చారని ఆయన విమర్శించారు. వాస్తవానికి ఇందిరా గాంధీ రాజ్యాంగ పీఠికలో ఈ పదాలను చేర్చడం ద్వారా తన విశ్వసనీయతను చాటుకునే ప్రయత్నం చేశారు.అయితే రాజ్యాంగ వ్యవస్థ మౌలిక ఉపదేశంలో లౌకికవాదం, సోషలిజాలకు సంబంధించిన వాటిని మార్చడానికి వీల్లేదని కేశవానంద భారతి కేరళ రాష్ట్రం మధ్య సాగిన వివాదంపై వచ్చిన తీర్పులో వివరించినట్టు సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ తరువాత 1994లో ఎస్.ఆర్ బొమ్మయ్ కేంద్ర ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదంలో కూడా లౌకికవాదం రాజ్యాంగ మౌలిక అంశమని, రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్ దానిని మార్చటానికి వీల్లేకుండా చేసిందని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. రాజ్యాంగం అవతరించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిస్టు పదాలను తీసివేయాలని సుప్రీం కోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘకాలం విచారణ జరిగింది.చివరకు 2024 నవంబరు 25న ఆ కేసులన్నీ కొట్టివేస్తూ సుప్రీం తీర్పు ఇచ్చింది. ఆ పదాలు రాజ్యాంగబద్ధమే అని స్పష్టం చేసింది. ఈ విధంగా తీర్పులు వచ్చినా ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ వర్గాలు సెక్యులరిజం, సోషలిజం పదాలపై అనవసర రాద్ధాంతాన్ని సాగిస్తున్నారు. ఈ పదాలపై సమీక్ష చేయాలని హొసబలే పిలుపునివ్వడం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను బేఖాతరు చేయడమే. అధికారం తమ చేతిలో ఉందికదా ఏదైనా చేయవచ్చునన్న ధీమా కమలనాథుల్లో పేరుకుపోయింది. చివరికి ఆ పదాలను తొలగించినా ఆశ్చర్యపోనక్కరలేదు. విభజన వాదాలతో పబ్బం గడుపుకుంటున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి రోజురోజుకీ అనేక సవాళ్లు పెరుగుతున్నాయి. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక, మణిపూర్ వంటి తీవ్ర సంఘర్షణలను నివారించలేక ప్రజల దృష్టిని మళ్లించడానికి అనేక ఎత్తుగడలు పన్నుతున్నారు.అందులో భాగంగానే ఎమర్జెన్సీ 50 ఏళ్ల సంఘటనను సాకుగా పెట్టుకుని ఊరూవాడా సభలు, చర్చలు పెట్టి కాంగ్రెస్ వంటి ప్రతిపక్షాలపై విషం చిమ్మేలా ప్రచారం చేస్తున్నారు. అందులో రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాలపై సమీక్ష జరగాలన్న వివాదాన్ని ప్రముఖంగా తెరపైకి తెస్తున్నారు. సెక్యులరిజం (సామ్యవాదం) అన్నది మన భారతీయ సంస్కృతిలో పాతుకుపోయింది. విధాన రూపకల్పనలోను, పరిపాలనలోను మార్గదర్శక సూత్రంగా పనిచేస్తోంది. ఈ మౌలిక సూత్రాలను ప్రశ్నించడమంటే భారతదేశాన్ని సమగ్రంగా కలిపి ఉంచే విభిన్న సామాజిక వస్త్రమనే సున్నితమైన సమతుల్యతను చెడగొట్టడమే. రాజ్యాంగ పీఠికలో సోషలిజం అనే పదాన్ని చేర్చడం సమస్యాత్మకమే. ఎందుకంటే సాంకేతికంగా సోషలిస్ట్ వ్యతిరేక పార్టీలను ఇది నిషేధిస్తుంది. కానీ అప్పుడు సోషలిస్టు వ్యతిరేక ఆర్థిక సరళీకరణ విధానాల రూపకల్పనకు కానీ, అమలుకు కానీ ఈ పీఠిక సెక్యులర్, సోషలిస్టు పదాలు ఎలాంటి సమస్యను తీసుకురాలేదు.అందువల్ల ఈ రెండు పదాలపై సంఘ్ పరివార్ విరక్తి చెందడం అర్థం లేని విషయం. ఇటువంటి సైద్ధాంతిక ప్రయత్నాల ప్రమాదం దేశం నిత్యం ఎదుర్కొంటున్న వాస్తవమైన, ప్రత్యక్షమైన సమస్యలపై దృష్టిని కేంద్రీకరించనీయకుండా ఆటంకం కలిగిస్తుంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, వ్యవసాయ సంక్షోభం, ప్రజారోగ్య భద్రత లోపం, నాణ్యమైన చదువులు లేకపోవడం, పర్యావరణ క్షీణత, ఆర్థిక అసమానతలు పెరిగిపోవడం, తదితర ముఖ్యమైన సమస్యల పరిష్కారం కోసం తగిన ప్రయత్నం చేయనీయదు. ఈ సమస్యలను పరిష్కరించడానికి బదులు రాజకీయ వ్యవహారమే ప్రాధాన్యంగా మారిపోయిప్రతీకాత్మకమైన, విభజనకరమైన చర్చలకు దారితీస్తుంది. దీనివల్ల ప్రజల దైనందిన జీవితాలకు అందవలసిన ప్రయోజనాలు సరిగ్గా అందకుండాపోతాయి. ఈ దూకుడు సైద్ధాంతిక ఎత్తుగడలు బిజెపి రాజకీయ ప్రయోజనాలను ఏ విధంగానూ నెరవేర్చలేవు. వాస్తవానికి అవి వ్యతిరేక పరిణామాలకు దారితీస్తాయి.ఉదాహరణకు ఉప్పు, నిప్పులా భగ్గుమంటూ విడిపోయే బంధువులు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే ఈ పీఠిక పదాల తొలగింపు నిర్ణయానికి వ్యతిరేకంగా చేతులు కలపడం గమనించాల్సిన విషయం. ఈ సిద్ధాంతపరమైన విధానం బిజెపి క్యాడర్‌కు, సిద్ధాంతపరమైన ఎత్తుగడదారులకు సంతృప్తి కలిగించవచ్చు. కానీ ఆధునిక ఓటర్లను, ప్రాంతీయ పార్టీల పొత్తులను దూరం చేస్తుంది. విస్తృతమైన ఎన్నికల విజ్ఞప్తిని అణచివేస్తుంది. దేశంలో ఓటర్లు ముఖ్యంగా యువత తమకు ఆర్థికంగా ఎలాంటి ఎదుగుబొదుగు ఉండడం లేదని, ఉద్యోగాలు రావడం లేదని తదితర నిరాశా, నిట్టూర్పులతో సతమతమవుతున్నారు. శక్తివంతమైన ప్రజాస్వామ్యంలో సైద్ధాంతిక చర్చలు ఒక అంతర్భాగమైనప్పటికీ, కాషాయవాదుల వ్యత్యాసాలు, విభజన వాదాలు ముఖ్యమైన అభివృద్ధి అంశాలను పక్కదారి పట్టిస్తాయి.

# నైరుతి ముఖం చాటేయడంతో ఆందోళన

- **రాయలసీమలో వేరుశనగాకు కష్టకాలం**

**విజయవాడ,జులై3:** మరోమారు ఖరీఫ్‌పై నైరుతి తీవ్ర ప్రభావం చూపింది. పలు జిల్లాల్లో ఇప్పటికీ చినుకు జాడ లేదు. దీంతో పంటలు ఆలస్యం కవాడంతో పాటు, పలు జిల్లాల్లో వేసిన విత్తనాలు వట్టిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఎప్పటి కంటే కాస్తంత ముందుగా మే 26, 27 తేదీల్లో రాష్ట్రాన్ని పలకరింయాయి. దీంతో వానలు పడతాయని, ఖరీఫ్ పంటల సాగుపై రైతుల్లో ఆశలు చిగురించాయి. అంతలోనే రుతుపవనాలు సుదీర్ఘకాలం ముఖంచాటేయడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. తిరిగి వారం రోజులుగా రుతుపవనాల్లో కదలిక రావడంతోపాటు అల్పపీడనం, ఉపరితల ఆవర్తనాల వలన కొద్దిపాటి వానలు కురుస్తున్నాయి. కాగా రుతుపవనాల ఆగమనంతో సీజన్ మొదటి నెల జూన్లో సాధారణ వర్షం పడటం మామూలే. కానీ వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరగడంతో పంటలు వేసుకునే వారికి ప్రతికూల వాతావరణం ఏర్పడింది. దీంతో ఎపిలో8 జిల్లాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. తెలంగాణలోనూ ఉత్తర, దక్షిణ జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. రాయలసీమలో వేరుశనగ రైతులు వానల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అరకొరగా సబ్సిడీపై అందిస్తున్న విత్తనాల పంపిణీ మందకొడిగా సాగుతోంది. ఇతర మెట్ట పంటల సేద్యం సైతం నెమ్మదిగానే కొనసాగుతోంది.ఈ మారు ఖరీఫ్ ప్రారంభంలోనే రాష్ట్రాన్ని వర్షాభావం వెంటాడుతోంది. జూన్ మాసంలో ఎనిమిది జిల్లాల్లో సాధారణస్థాయి కంటే తక్కువ వర్షం నమోదైంది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, దక్షిణాంధ్రలో పల్నాడు, నెల్లూరు, రాయలసీమలో అనంతపురం, కర్నూలు, నంద్యాల మినహా తతిమ్మా జిల్లాల్లో వర్షాభావం నెలకొంది.





ఆదిలోనే వర్షాభావం ఎదురుకావడంతో ఆయా ప్రాంతాల్లో పంటల సేద్యం దాదాపుగానిలిచిపోయింది. అల్లూరి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల సగటు లెక్కల ప్రకారం వర్షాభావానికి దగ్గరగా ఉన్నాయి. రాష్ట్రంలో సగటున సాధారణ వర్షం కురిసినట్లు కనిపిస్తో ంది. మొత్తం 26 జిల్లాలుండగా ఎనిమిది జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. అత్యల్పం గా అన్నమయ్య జిల్లాలో 54.69 శాతం తక్కువ వర్షం పడింది. సాధారణం కంటే ఎక్కువ వర్షం తొమ్మిది జిల్లాల్లో కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో 70.72 శాతం ఎక్కువ వర్షం నమోదైంది. మిగతా తొమ్మిది జిల్లాల్లో సాధారణ స్థాయిలో వానలు పడ్డాయి. ఈ ఏడాది అనంతపురంలో సాధారణం కంటే ఎక్కువ వర్షం పడింది. జూన్‌లో లో ఆ జిల్లాలో మామూలుగా 41.85 మిమీ వర్షం పడాల్సి ఉండగా 54.73 మిమీ పడింది.

# 'ఆంధీ వచ్చేసింది'

## గూస్‌బంప్స్ తెప్పిస్తున్న 'హరి హర వీరమల్లు' ట్రైలర్..



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా ట్రైలర్ విడుదలైంది. మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన వీరమల్లు అనే యోధుడి పాత్రలో పవన్ పవర్‌ఫుల్‌గా కనిపించారు.
ట్రైలర్‌లోని భారీ యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ చిత్రంలో సనాతన ధర్మాన్ని కాపాడే వీరుడిగా, కోహినూర్ వజ్రాన్ని దక్కించుకోవడానికి మొఘలులను ఢీకొట్టే వీరమల్లుగా పవర్‌స్టార్ కనిపించనున్నారు. క్రూరమైన మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ భయంకరంగా కనిపిస్తున్నారు. పవన్, బాబీల మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది.ముఖ్యంగా "ఆంధీ వచ్చేసింది" అనే డైలాగ్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. పవన్ రాజకీయ ప్రస్థానాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను ఈ డైలాగ్ గుర్తుచేస్తోంది. అలాగే "అందరూ నేను రావాలని దేవుడిని ప్రార్థిస్తారు.. కానీ మీరు మాత్రం నేను రాకూడదని కోరుకుంటున్నారు" అనే సంభాషణ కూడా ఆయన ప్రస్తుత ఇమేజ్‌కు సరిగ్గా సరిపోయిందనే చెప్పాలి.
క్రిష్, జ్యోతి కృష్ణ ఈ చారిత్రక కథను భారీ హంగులతో తెరకెక్కించారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అందించిన నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. పవన్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఏ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా

# ఆకట్టుకుంటున్న

## 'రామాయణ' ఫస్ట్ గ్లింప్స్

రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి

దర్శకత్వం వహిస్తున్న నితీశ్ తివారీ

మూడు నిమిషాల నిడివితో వచ్చిన ప్రత్యేక వీడియో

సినిమాలోని కీలక పాత్రలను పరిచయం చేసిన చిత్రబృందం



భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రామాయణ' సినిమా నుంచి ఓ కీలక అప్డేట్ వచ్చింది. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, ప్రముఖ నటి సాయి పల్లవి సీతగా నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం నుంచి తాజాగా ఓ ప్రత్యేక గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. రామాయణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు మరింత ఊతమిస్తూ, సినిమాలోని ప్రధాన పాత్రలను పరిచయం చేసే ఉద్దేశంతో ఈ తొలి వీడియోను విడుదల చేశారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీత దేవిగా సాయి పల్లవి లుక్స్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.
భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. ఈ గ్లింప్స్ విడుదలతో సినిమా ప్రమోషన్లు అధికారికంగా మొదలైనట్టేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో..

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వినాద్రి, బేబీ నేహా శ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్.బిగ్ బాస్ సీజన్ 7 ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి జుడా సంధ్య సంగీతాన్ని అందించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కు వివి వినాయక్ ముఖ్య అతిథిగా రఘు కుంచే, కేఎల్ దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటించిన గౌతమ్ కృష్ణకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా మంచి విజయం సాధించి సతీష్ ప్రయాణానికి తోడ్పడాలని కోరుకుంటున్నాను"అని అన్నారు.నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ "ఈ సినిమా గౌతం సినీ కెరీర్‌లో ఒక మంచి మైల్ స్టోన్ కావాలని కోరుకుంటున్నాను. ఈ సోలో బాయ్ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది"అని పేర్కొన్నారు. దర్శకుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ%ా% "ఈ సినిమాలో గౌతమ్ కృష్ణ ఎంతో అద్భుతంగా నటించారు. అలాగే ఇద్దరు హీరోయిన్లు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటారు" అని తెలిపారు. హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ "మధ్యతరగతి కుటుంబంలో ఉండే ఎన్నో విషయాలు ఈ సినిమాలో ఉండబోతున్నాయి. దర్శకుడు నవీన్ కుమార్ ఈ సినిమాను మంచి అవుట్‌పుట్‌తో రూపొందించాడు"అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్లు శ్వేత అవస్తి, రమ్య పసుపులేటి, అనిత చౌదరి, ఆట సందీప్, లిరిసిస్ట్ పూర్ణచారి పాల్గొన్నారు.

# అందరూ లీలగానే...అందుకే అవకాశాలు వదిలేసా!

కాంతార%-%తో వెలుగులోకి వచ్చిన కన్నడ బ్యూటీ సప్తమీగౌడ గురించి పరిచయం అవసరం లేదు. తొలి సినిమాలో నేచురల్ బ్యూటీతో అలరించింది. లంగావోణీ దుస్తుల్లో క్రేజీ బ్యూటీగా పాపులర్ అయింది. 'కాంతార' పాత్రలోనూ కాస్త బోల్డ్‌నెస్ హైలైట్ అయింది. సహజంగా బోల్డ్ సన్నివేశాల్లో సౌత్ నటులు కనిపించడం చాలా అరుదు. సీన్ డిమాండ్ చేస్తే తప్ప అలాంటి ఛాన్స్ తీసుకోరు. ఆ రకంగా సప్తమీ గౌడ హైలైట్ అయింది. కాంతార హిట్ తర్వాత బాలీవుడ్..టాలీవుడ్ లో ఛాన్స్ లందు కుంది. ప్రస్తుతం తెలుగులో నితిన్ హీరోగా నటించిన తమ్ముడులో నటించింది. ఇదే అమ్మడికి తొలి తెలుగు సినిమా. ఈ సినిమా సహా బాలీవుడ్ లో థామా%లో నటిస్తోంది. ఇవిగాక కన్నడ సహా ఇతర పరిశ్రమలో చాలా అవకాశాలు వదులుకున్నట్లు సప్తమీగౌడ రివీల్ చేసింది. కాంతార సక్సెస్ తర్వాత చాలా సినిమాల్లో హీరోయిన్ పాత్రలు వచ్చాయంది. కానీ అవన్నీ కూడా కాంతార తరహా పాత్రలనే పోలి ఉన్నాయని..ఆ కారణంగానే వదులుకున్నట్లు తెలిపింది. ఒకసారి చేసిన పాత్రను మళ్లీ చేయడం వలన ఉపయోగం ఏంటి? మహా అయితే పారితోషికం అందుకుంటాం. అంతకు మించి ఆ సినిమా ద్వారా తనకు వచ్చే గుర్తింపు అంటూ ఏదీ ఉండదని అభిప్రాయపడింది. సరిగ్గా అదే సమయంలో తమ్ముడు కథ తన వద్దకు రావడం..పాత్ర డిఫరెంట్ గా ఉండటంతో వెంటనే అంగీకరించినట్లు తెలిపింది. పాత్రకు సరిపోతానా? లేదా? అని లుక్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేసారు. నన్ను తప్ప మరో నటిని వాళ్లు కూడా చూడలేదు. ఈ పాత్ర కోసం గుర్రపు స్వారి నేర్చుకోవాలన్నారు. మొదట కాస్త భయమేసినా ధైర్యంగా నేర్చుకున్నానునని తెలిపింది. అలాగే %-%పుష్ప%-% సినిమలో రష్మికా మందన్నా పోషించిన శ్రీవల్లి లాంటి పాత్ర పోషించాలని ఉందంది. విభిన్నమైన పాత్రలు చేయడానికి ఏమాత్రం వెనకడుగు వేయనని తెలిపింది.



# హాలివుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కి ఎంపికైన దీపిక పదుకొణె



ప్రముఖ నటి దీపికా పదుకొణెకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ఆమె హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కు ఎంపికయ్యారు. ఈ మేరకు హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది.మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయ నటి దీపిక కావడం విశేషం. హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విడుదల చేసిన జాబితాలో డెమి మూర్, రాచెల్ మెక్ ఆడమ్స్, ఎమిలీ బ్లంట్ వంటి హాలీవుడ్ తారలతో పాటు దీపిక పేరు కూడా ఉండటంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కు 35 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు ఛాంబర్ ప్రకటించింది.కాగా, దీపికా పదుకొణె 2006లో సినీ పరిశ్రమలోకి ప్రవేశించగా, 2017లో రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్‌తో హాలీవుడ్ తెరపై మెరిశారు. ప్రస్తుతం అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కలయికలో రానున్న బహుభాషా చిత్రంలో దీపిక నటిస్తున్నారు. దీని తర్వాత కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లోనూ నటించనున్నారు.